ఆక్రమణల తొలగింపు

● అడ్డుకున్న మహిళలు



కట్టడాల కూల్చివేతను అడ్డుకుంటున్న మహిళలు

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్‌పురం శివార్లలోని 167బి జాతీయ రహదారి పక్కన ఉన్న పశువులమేత పొలాల్లోని ఆక్రమణలను శనివారం కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ ఆదేశాలతో తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా ఆధ్వర్యంలో తొలగింపు చేపట్టారు. కొన్నేళ్లుగా హైవే పక్కన ఉన్న పశువులమేత భూమి సర్వేనంబర్ 147/1, 162/1లో కొందరు ఇంటి నిర్మాణాలు, ప్రహరీలు నిర్మించడంతో పాటు కొందరు పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్డీవో ఆదేశాలతో ఆక్రమణల తొలగింపులో భాగంగా పునాదులను, ప్రహరీలను, గుడిసెలను తొలగింపు ప్రారంభించగా కాలనీలవారు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి నిర్మాణాలను తొలగిస్తున్న జేసీబీలకు అడ్డుగావచ్చి కూల్చివేతను అడ్డుకున్నారు. బాలరాజు అనే యువకుడు తాను కూలీనాలీ చేసుకొని జీవిస్తున్నారని, చిన్నపాటి ఇంటిని కూల్చివేస్తే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో సిబ్బంది నిలువరించారు. దీంతో తహసీల్దార్ మాట్లాడుతూ ఎవ్వరూ ప్రభుత్వ, మేత భూములను ఆక్రమించవద్దని, స్థలాలు లేకుంటే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వీఆర్‌ఓలు మనోజ్, కె.మాల్యాద్రి, శివ, పంచాయతీ కార్యదర్శులు రామ్‌కుమార్, వాణి, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలన ప్రజలకు అందుబాటులో ఉండాలి

కొండపి (సింగరాయకొండ): ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు అందించేందుకు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాలవీరాంజనేయ స్వామి ఆదేశించారు. శనివారం కొండపి నియోజకవర్గ కేంద్రంలో నియోజకవర్గ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఒంగోలు, కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఇతర శాఖ అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను గురించి మంత్రి స్వామి శాఖల వారిగా సమీక్షించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలపై స్పందించాలని, రోజువారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకొని సాయంత్రం లోపు సమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, కనిగిరి ఆర్డీఓ జాన్ ఎర్విన్ అధికారులు పాల్గొన్నారు.

బేబి కిట్ల పంపిణీ

కనిగిరి రూరల్: మండలంలోని యడవల్లి ఎంపీటీసీ వట్టివేళ్ల రంగమ్మ, ఆమె కుమారుడు రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ నాయకుడు వట్టి వేళ్ల రంగబాబులు బాలింతలకు శనివారం బేబి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

కనిగిరి రూరల్: మోడల్ స్కూల్‌కు అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక గార్లపేట రోడ్డులోని మోడల్ స్కూల్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు.

టీచర్ల కొరత సమస్య పరిష్కరించాలి

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. ఒంగోలులో జరిగిన జెడ్పీ సమావేశంలో కనిగిరి మండలానికి చెందిన పలు సమస్యలపై మాట్లాడారు. కనిగిరి, లింగారెడ్డిపల్లి, దిరిశవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో టీచర్ల కొరత సమస్యలను పరిష్కరించాలని, ప్లే గ్రౌండ్ లెవలింగ్ చేయించాలని, మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల

పామూరు: మండలంలోని కంబాలదిన్నె సమీపంలోని అభయ ఆంజనేయస్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిగ్రహమూర్తికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి, సువర్చల ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణోత్సవం నిర్వహించి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

'విద్యా ప్రవేశం' విజయవంతం చేయండి

లింగసముద్రం: విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ–2 శివకుమార్ అన్నారు. మండలంలోని వీఆర్ కోట ఎంపీపీ పాఠశాలలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల హాజరును పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ ఈ నెల 28 నుంచి జూలై 25 వరకు విద్యా ప్రవేశం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. హెచ్‌ఎంలు లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రతి పాఠశాలలో పిల్లల హాజరు పెంపునకు కృషి చేయాలన్నారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఉండేలా చూడాలన్నారు.

కనులపండువగా శాంతి కల్యాణం



అమ్మవార్ల ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పామూరు: మండలంలోని కమ్మవారిపాలెం, రఘునాథపురం అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం శాంతి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు కొల్లూరి రవికిరణ్‌శర్మ అచ్చమాంబ మూల విగ్రహమూర్తికి పంచామృతాభిషేకం విశిష్ట పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకవాహనపై మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

హనుమంతునిపాడు: అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఎంఈఓలు పెద్దిరాజు, రమణయ్య, దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ చేయనున్న జీవీ సురేష్‌బాబు సన్మాన కార్యక్రమం ఉపాధ్యాయుడు సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా సన్మానించారు. అనంతరం గత ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులకు రూ.10 వేల నగదు ప్రోత్సాహం అందజేశారు. ఎంఈఓ దాసు ప్రసాదు ,జె ప్రసాదు, శ్రీనివాచాచారి, ఉడుముల నారాయణరెడ్డి, భారతి, ఆర్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

సింగరాయకొండ: నియోజకవర్గంలోని జరుగుమల్లి, పొన్నలూరు మండల పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు సెబ్ సీఐ నరహరి తెలిపారు. జరుగుమల్లి మండలం నందనవనం వద్ద పలుకూరు మండలం వెంగముక్కలపాలేనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జి. రాఘవ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని 10 వేల రూపాయలు జరిమానా విధించామన్నారు. పొన్నలూరు మండలం ఉప్పలదిన్నె వద్ద పొన్నలూరు గ్రామానికి చెందిన కె. మహేష్ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకుని 10 వేల రూపాయలు జరిమానా విధించినట్లు వివరించారు.

మలేరియా నిర్మూలనలో భాగస్వాములు కావాలి



పామూరు అవగాహన చేస్తున్న ఎస్‌యూఓ రామాంజనేయులు

పామూరు: మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని సబ్ యూనిట్ ఆఫీసర్ రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శనివారం మండలంలోని బొట్లగూడూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌యూఓ రామాంజనేయులు మాట్లాడుతూ మలేరియా, డెంగీచికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు మొదలైనవి దోమకాటు ద్వారా వస్తాయన్నారు. హెచ్‌ఈఓ పెరుగు శ్రీధర్, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక మున్సిపల్ సమావేశం వాయిదా

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపల్ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో శనివారం వాయిదా పడింది. మున్సిపాలిటీలోని మొత్తం 20 మంది సభ్యులకు గాను కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. కనీసం 13 మంది సభ్యులు ఉంటేనే కోరం ఏర్పడుతుంది. కొందరు సభ్యులు వివిధ కారణాల వల్ల హాజరు కాలేక పోయారని, తదుపరి సమావేశం తేదిని త్వరలో ప్రకటిస్తామని చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ టీవీ రంగారావు, మేనేజర్ ప్రసాద్, ఏఈ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర రూ. 295.16



వీడ్కోలు పలుకుతున్న వేలం నిర్వాణాధికారి సునీల్ కుమార్, బోర్డ్ సిబ్బంది

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ. 295.16 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డ్ పరిధిలో శనివారం కామేపల్లి, పచ్చవ, గ్రామాలకు చెందిన రైతులు 1079 బేళ్ళు వేలానికి తీసుకొని రాగా అందులో 1015 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 64 బేళ్ళను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర రూ. 358, కనిష్ట ధర రూ. 204, సరాసరి ధర రూ. 295.16 పలికింది. వేలంలో 29 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. తన చివరి పనిదినం కావడంలో వేలం నిర్వహణాధికారి వేలంలో చివరి బేళ్ళ ను సీనియర్ గ్రేడ్ అధికారి సాయి కుమార్‌తో బిడ్ నిర్వహించారు. సాయికుమార్ వేలం నిర్వహిస్తున్న సమయంలో అందరు చప్పట్లు కొట్టి ఘన వీడ్కోలు పలికారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ. 360 పలికిందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. బోర్డ్ పరిధిలో శనివారం నిడమనూరు గ్రామానికి చెందిన రైతులు 1131 బేళ్ళు వేలానికి తీసుకొని రాగా అందులో 1092 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 39 బేళ్ళను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర రూ. 360, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ. 304.95 పలికింది. వేలంలో 24 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 52 కేసుల పరిష్కారం

కనిగిరి రూరల్: జాతీయ లోక్ అదాలత్‌లో 52 కేసులు పరిష్కరించినట్లు కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. చిన్న పొరపాటు, క్షణిక ఆవేశం కారణంగా గొడవలు, మనస్పర్థలు, పెట్టుకుని కేసుల వరకు వెళిల్ కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకుని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజీ మార్గమే రాజ మార్గంగా పేర్కొన్నారు.